పింఛన్ కోసం క్యూలో పాస్‌బుక్కులు

నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పాత పీహెచ్‌సీ క్వార్టర్స్‌లో గురువారం పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా.. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పింఛన్ కోసం పాసుబుక్కులు పట్టుకుని క్యూలో నిలబడ్డారు. –కుభీర్

• పింఛన్ల కోసం రోడ్డెక్కిన వృద్ధులు

పింఛన్ల కోసం వృద్ధులు, ఒంటరి మహిళలు రోడ్డెక్కారు. ప్రతినెలా పింఛన్ డబ్బులను ఆలస్యంగా ఇస్తున్నారని, రెండు నెలలుగా వాటిని కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తూ వనపర్తి జిల్లా ఆత్మకూరులోని వృద్ధులు గురువారం గాంధీచౌక్‌లో రోడ్డుపై ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. –ఆత్మకూరు

• దవాఖానకు దారేది?

నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పీహెచ్‌సీ ఎదుట వర్షాలకు వరద చేరింది. గురువారం సంత కావడంతో గిరిజన గ్రామాల నుంచి దవాఖానకు భారీ సంఖ్యలో రోగులు వచ్చారు. మోకాళ్ల లోతు నీళ్లు ఉండటంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో కుభీర్ యువకులు వరద నీటిలో నాటు వేసి నిరసన తెలిపారు. సమస్యను పరిష్కరించాలని వైద్యురాలికి వినతిపత్రం సమర్పించారు. –కుభీర్

• బదిలీలపై ఉపాధ్యాయుల నిరసన

డిమాండ్లను పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. భోజన సమయంలో ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వం చిన్నచూపుస్తున్నదని, పదేండ్లు దాటినా బదిలీలు చేపట్టలేదని విమర్శించారు. 317 జీవోను తమకు అమలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. –నాగిరెడ్డిపేట

భూదాన్ పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గంజ అంజయ్య, చింతకింది మల్లేశం, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు

సిరిసిల్ల పట్టణంలో నేతన్నల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఐ నేత చాడ వెంకటరెడ్డి

చేనే తరంగ పరిరక్షణకు ఉద్యమించాలి

- ఇక్కత్ డూప్లికేట్ వస్త్రాలను అడ్డుకోవాలి
- పద్మశ్రీ అవార్డు గ్రహీతల పిలుపు
- పోచంపల్లిలో నేతన్నల భారీ ర్యాలీ

భూదాన్‌పోచంపల్లి, జూలై 25 : చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం చేనేత సంఘాల నాయకులు, కార్మికులు సంఘటితంగా ప్రభుత్వాలపై ఉద్యమించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గంజ అంజయ్య, చింతకింది మల్లేశం పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో గురువారం చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చేనేత సంఘాల నాయకులు, కార్మికులు నేతన్న విగ్రహం నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. మిల్లుల్లో చేనేత ఇక్కత్ డిజైన్లతో డూప్లికేట్ వస్త్రాలు తయారుచేసి షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత కార్మికులు వీధిన పడే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కంపెనీల్లో ప్రింట్ అయ్యే ఇక్కత్ డిజైన్ వస్త్రాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కత్ డూప్లికేట్‌ను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని చేనేత, జౌళి శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మునాసు వెంకటేశం మాట్లాడుతూ.. హైదరాబాద్ మార్కెట్లోకి గుజరాత్, సూరత్, ముంబై నుంచి పెద్దఎత్తున వస్త్రాలు దిగుమతి అవుతున్నాయని, షాపింగ్ మాల్స్‌లో ఇక్కత్ వస్త్రాలని చెప్పి ప్రింటింగ్ వస్త్రాలు తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత మార్కెట్ దెబ్బతింటున్నదని తెలిపారు.

సిరిసిల్ల బంద్ సక్సెస్

రాజన్న సిరిసిల్ల, జూలై 25 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించి, ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు ఇచ్చిన సిరిసిల్ల బంద్ గురువారం విజయవంతమైంది. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సంపూర్ణమైంది. వాణిజ్య, వ్యాపార వర్గాలు మద్దతు తెలిపాయి. అన్ని పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. ఆర్టీసీ బస్సులు కూడా సరిగా నడవలేదు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన రిలేదీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. బంద్‌లో భాగంగా నేతన్నలు సిరిసిల్ల నేతన్న చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. వందలాది మంది తరలి వచ్చి మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకు పోయిందని, కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని నేతన్నలు డిమాండ్ చేశారు. నిరసనలో జేఏసీ నాయకులు ఆడెపు రవీందర్, మూషం రమేశ్, పంతం రవి, ఏనుగుల ఎల్లయ్య, స్కైలాబ్ బాబు, కోడం రమణ, రవి, దూడం శంకర్, సామల శ్రీనివాస్, పినగాని రాజేశం, గుంటి వేణు, మండల సత్యం పాల్గొన్నారు.

దీక్షకు సీపీఐ నేత చాడ సంఘీభావం

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. నేతన్నలు చేపట్టిన రిలేదీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరమగ్గాలు బంద్ పడి వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పవర్‌లూం సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేతన్నల బతుకులు రోడ్డున పడుకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని అన్నారు.

'మలక్‌పేట' ఘటనలో వార్డెన్ సస్పెండ్

పూర్తి స్థాయి విచారణకు త్రీమెన్ కమిటీ

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో ఎనిమిదేండ్ల బాలికపై జరిగిన లైంగికదాడి ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘటన తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సాధికారతశాఖ డైరెక్టర్ శైలజ వసతి గృహాన్ని సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ రిపోర్ట్ ఆధారంగా ఉన్నతాధికారులు వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. డైరెక్టర్ శైలజ చైర్మన్‌గా, వికలాంగుల సాధికారతశాఖ ఏడీ రాజేందర్, హైదరాబాద్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఆశన్న సభ్యులుగా త్రీమెన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికను అందించాలని కమిటీకి ఆదేశాలు జారీ చేసింది.

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ తరపున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానంనాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరుతూ హైకోర్టులో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. తదుపరి విచారణను శుక్రవారం కొనసాగిస్తామని ప్రకటించారు.

ఫార్మా విలేజ్ భూసర్వేను అడ్డుకున్న రైతులు

- సీఎం ఇలాకాలో అన్నదాతల నిరసన
- గ్రామసభల ద్వారా సర్వే చేయాలని వినతి

బొంరాస్‌పేట, జూలై 25 : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోనే రైతుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దుద్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మా విలేజ్ కోసం గురువారం చేపట్టిన భూసర్వేను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని పోలేపల్లి, హకీంపేట, లగచెర్ల, పులిచెర్ల కుంట తండాలలోని ప్రభుత్వ భూమిని రైతులకు పంపిణీ చేయగా, సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ భూములను ప్రభుత్వం ఫార్మా విలేజ్ కోసం సేకరించడానికి పూనుకున్నది. గురువారం పోలేపల్లిలోని సర్వే నంబరు 67 లోని 130.21 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయడానికి ఆర్ఐ రవిచారి, సర్వేయర్ల బృందం హకీంపేటకు చేరుకుని సర్వే చేయడానికి యత్నించగా రైతులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం రైతులు తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సభలు పెట్టి భూసర్వే నిర్వహించాలని రైతులు కోరారు.



దుద్యాల తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

• 'విద్య'కు నిధుల కోతపై విద్యార్థి సంఘాల నిరసన

తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడంపై విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాల్లో గురువారం బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద బడ్జెట్ ప్రతులను తగులబెట్టారు. –ఖమ్మం ఎడ్యుకేషన్

ఏసీబీకి చిక్కిన ముగ్గురు అధికారులు

- మధ్యవర్తి ద్వారా రూ.80 వేలు తీసుకున్న పరకాల సబ్ రిజిస్ట్రార్
- రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడిన పాల్వంచ పట్టణ ఎస్సై
- మక్తల్‌లో రూ.9 వేలు తీసుకుంటూ దొరికిన ప్రభుత్వ సర్వేయర్
- కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఎస్సై రాము

పరకాల/పాల్వంచ/మక్తల్, జూలై 25: వేర్వేరు జిల్లాల్లో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రభుత్వ అధికారులు గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అందులో ఒకరు హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్, మరొకరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం ఎస్సై, ఇంకొకరు నారాయణపేట జిల్లా మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ ఉన్నారు. ఏసీబీ డీఎస్పీలు మీడియాకు వివరాలు వెల్లడించారు. పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామమైన సీతారాంపురానికి చెందిన అన్నదమ్ము లు లడే శ్రీనివాస్, శ్రీకాంత్.. తల్లిదండ్రుల పేరుతో 481/సీ సర్వేనంబర్‌లో ఉన్న నాలు గుంటల భూమిని తమ పేరుమీద రెండు సమ భాగాలుగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌ను సంప్రదించారు. విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ సునీత దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె రూ.80 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ప్లాన్ ప్రకారం.. వా రు గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు రూ.80 వేల నగదు ఇచ్చారు. ఏసీబీ డీఎస్పీ సాంబ య్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శ్యాం, రాజు ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ నరేశ్ నుంచి రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు. 2 గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి సబ్ రిజిస్ట్రార్ సునీత, ప్రైవేట్ డాక్యుమెంట్‌రైటర్ బొట్ల నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఓ కేసు విషయమై న్యాయవాది నుంచి ఎస్సై రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. పాల్వంచకు చెందిన సీరపు శ్రావణి కొత్తగూడెంకు చెందిన బాలసాని గణేశ్‌గౌడ్‌కు రూ.20 వేలు అప్పుగా ఇచ్చింది. అనంతరం గణేశ్ గౌడ్ మరణించగా.. డబ్బులు ఇవ్వాలని అతడి కుటుంబ సభ్యులపై కొత్తగూడెం కోర్టు లో శ్రావణి కేసు వేసింది. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడానికి ఎఫ్ఐఆర్ కాపీ కావాలని శ్రావణి తరపు న్యాయవాది ఎస్సైని సంప్రదించగా.. డబ్బులు డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారుల ప్లాన్ ప్రకారం.. న్యాయవాది లక్ష్మారెడ్డి పాల్వంచలోని ఎస్సై రాము ఇంటికి వచ్చి రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో.. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన రైతు గాసం వెంకటేశ్.. మంతన్‌గోడ్ గ్రామ సమీపంలో సర్వేనెంబర్ 107, 121లో 17 ఎకరాల భూమి సర్వే చేయాలని ఈ ఏడాది ఏప్రిల్ 22న మీ సేవలో డబ్బులు చెల్లించాడు. సర్వేయర్ బాలరాజు జూన్ 26న పొలం వద్ద సర్వేకు వెళ్లాడు. హద్దులు నిర్ణయించేందుకు మ్యాప్ తీసుకొస్తానని చెప్పి రైతు వద్ద రూ.3 వేలు తీసుకున్నాడు. తర్వాత రూ.12 వేలు ఖర్చు అవుతుందని, ఇప్పటికి రూ.3 వేలు ఇచ్చావు.. మరో రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. చేసేది లేక ఏసీబీ అధికారుల సాయంతో గురువారం సాయంత్రం సర్వేయర్‌కు రూ.9 వేలు ఇస్తుండగా పట్టుకున్నారు. ఇప్పటి వరకు సర్వేయర్ బాలరాజు మూడుసార్లు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. డీఎస్పీ శ్రావణ కృష్ణగౌడ్, ఎస్సైలు ఖాదర్ జిలానీ, లింగయ్య, పాల్గొన్నారు.

పట్టుబడిన బాలరాజు

ఏసీబీ అదుపులోకి పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ నరేశ్

శ్రీశైలానికి 2.5 లక్షల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులు ఇప్పటికే నిండిపోగా, దిగువకు వరదను విడుదల చేస్తున్నారు. దీంతో జూరాలకు, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. గురువారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 2.27 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 2.50 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం వచ్చి చేరుతున్నది. మరోవైపు తుంగభద్ర నుంచి సైతం దాదాపు 98 వేల క్యూసెక్కుల మేరకు వరద కొనసాగుతున్నది. ఇక గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. ఎస్సారెస్పీకి 21,650, నిజాంసాగర్‌కు 960 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కడెం పూర్తిగా నిండిపోగా 10,536 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. 18 గేట్లలో రెండు గేట్లు ఎత్తి 13,567 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 20,998 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. గురువారం రాత్రి 9 గంటల వరకు లక్ష్మీ బరాజ్ వద్ద 7.71 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది.

పిడుగుపాటు మరణాలే అధికం

- ప్రకృతి వైపరీత్యాలతో దేశంలో ఏటా 8వేల మందికిపైగా మృత్యువాత
- పిడుగులతో 2,500 మృతి
- 2022 ప్రకృతి వైపరీత్యాల నివేదికను వెల్లడించిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో
- 'దామిని' ద్వారా వాతావరణ శాఖ అలర్ట్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ) : సహజంగా తుఫాన్లు, భూకంపాలు, భారీ వర్షాలు, వరదలు, గాలిదుమారాలు, వడగాలులను ప్రకృతి విపత్తులుగా పరిగణిస్తుంటాం. పిడుగును ప్రకృతి విపత్తుగా ఎవరూ భావించరు. కానీ, అన్నింటికంటే పిడుగే అత్యంత ప్రమాదకారిగా ఎన్నోసార్లు నిరూపితమైంది. ప్రకృతి వైపరీత్యాల ద్వారా దేశంలో సంభవించే అత్యధిక మరణాలకు పిడుగులే కారణం! భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాల ప్రకారం పిడుగులతో ఏటా దేశంలో 2,500కు పైగా మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక మేరకు 2022లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా దేశంలో 8,060 మరణాలు సంభవించగా వాటిలో 2,887 మరణాలకు పిడుగుపాటే కారణమని తేలింది. అంటే ప్రకృతి వైపరీత్య మరణాల్లో 35.8 శాతం మరణాలకు పిడుగులే కారణమవుతున్నాయి. భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడిన ఘటనల్లో 358 మంది మృతిచెందగా దీనికి చాలారెట్లు ఎక్కువగా పిడుగులకు మృత్యువాతపడ్డారు. ఆ ఏడాది అత్యధికంగా మధ్యప్రదేశ్ (496), బీహార్ (329), మహారాష్ట్ర (239) లో సంభవించాయి. ప్రకృతి విపత్తులతో తమిళనాడులో 93 మరణాలు సంభవించగా వాటి లో పిడుగుపాటు మరణాలు 89 ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 248కి 210, పశ్చిమ బెంగాల్‌లో 195కి 161 పిడుగులతో సంభవించినవే కావ డం గమనార్హం. కర్ణాటకలో 140, ఆంధ్రప్రదేశ్‌లో 140, తెలంగాణలో 40 మంది ప్రకృతి విపత్తుల కారణంగా చనిపోగా, 96 మంది పిడుగుపాటుతో కన్నుమూశారు. 2019 నుం చి దేశంలో పిడుగుపాటు మరణాలు 20 నుం చి 35 శాతం మేర పెరిగినట్టు ఐఎండీ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. కానీ వీటిని ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలుగానే కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తున్నది.

ముందుగానే గుర్తించే 'దామిని'యాప్..

పిడుగులను ముందుగానే గుర్తించి హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'దామిని' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దామిని లైటింగ్ అలర్ట్ అనే ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జీపీఎస్ లొకేషన్ తెలుసుకునేందుకు యాప్‌కు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. 15 నిమిషాల్లో మనం ఉన్న ప్రాంతంలో పిడుగులు పడే అవకాశముందో? లేదో? ఈ యాప్ ద్వారా తెలుసుకునే వీలుంది. 2020 లో యాప్‌ను ఐఐటీఎం రూపొందించింది. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగుల గురించి ఈ యాప్ ముందుగానే హెచ్చరిస్తుంది. పిడుగులు పడే ప్రాంతంలో ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా చెబుతుంది. పిడుగుపాటును ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే పరిజ్ఞానం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ దగ్గరుంది. ఎర్త్ నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సెన్సార్లు ఏర్పాటు చేసి, ఎక్కడ పిడుగులు పడుతాయో ఓ అంచనాకు వస్తారు. ఫోన్లకు ఎస్సెమ్మెస్‌ల ద్వారా సమాచారాన్ని పంపి జనాన్ని అప్రమత్తం చేస్తారు.

గ్రామాల్లోనే మరణాలు ఎక్కువ

పిడుగుల కారణంగా దేశవ్యాప్తంగా 2020లో 2,862 మంది, 2021లో 2,880 మంది మరణించారు. గ్రామాల్లోనే 95-96 శాతం పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్నాయి. అమెరికా వంటి దేశాలతో పోల్చితే మన దేశంలో పిడుగుపాటు మరణాలు చాలా ఎక్కువ. అమెరికాలో ఏటా సరాసరి 20 మరణాలు సంభవిస్తున్నాయి. 2006 నుంచి 2021 వరకు ఆ దేశంలో 444 మంది పిడుగులతో చనిపోయారు. మన దేశంలో 1967 నుంచి 2019 వరకు లక్ష మంది పిడుగుపాటుకు గురై మరణించారు. ఇది 52 ఏళ్లలో ప్రకృతి వైపరీత్యాలతో సంభవించిన మరణాల్లో దాదాపు 33 శాతం! అలాగే వరదల కారణంగా సంభవించిన మరణాలకంటే రెండింతలు ఎక్కువ! ఐఎండీ గణాంకాల మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధికంగా పిడుగులు పడుతున్నాయి. కానీ, మధ్యభారతంలోనే పిడుగుపాటు మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. జూలైలో ఉత్తరప్రదేశ్ పిడుగులతో దద్దరిల్లిపోయింది. జూన్, జూలైలో బీహార్‌లో ఏకంగా 50 మంది దాకా మృత్యువాత పడ్డారు. ఆ రెండు రాష్ట్రాల్లో నెల వ్యవధిలోనే పిడుగుల కారణంగా సంభవించిన మరణాలు వందకు పైనే ఉన్నాయి.

కౌలు రైతు ఆత్మహత్య

అశోక్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి, జూలై 25 : సాగులో దిగుబడి రాక.. చేసిన అప్పులు తీర్చలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు మునగాల అశోక్(33) 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మూడేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. సాగులో దిగుబడి రాకపోవడం.. సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా, ఖమ్మం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

గాయపడిన నిహాన్‌రెడ్డి

అయిజ, జూలై 25: ఆడుకుంటున్న రెండేండ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో గురువారం చోటుచేసుకున్నది. పట్టణంలోని కర్నూల్ రహదారిలో మాధవి, భీమేశ్వర్‌రెడ్డి దంపతుల కుమారుడు నిహాన్‌రెడ్డి హోటల్ ఎదుట ఆడుకుంటుండగా.. కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడి అరుపులు విన్న తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు కుక్కలను తరిమి చిన్నారిని కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. మున్సిపాలిటీలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టుకొని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై చెట్టు కూలి యువకుడి మృతి

జహంగీర్ (ఫైల్)

ఏటూరునాగారం, జూలై 25: ములుగు జిల్లా ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మధ్యలో జాతీయ రహదారిపై చెట్టు బైక్‌పై వస్తున్న యువకుడిపై కూలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నబోయినపల్లికి చెందిన జహంగీర్ (30) గ్రామంలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. మందులను తీసుకెళ్లేందుకు ఏటూరునాగారానికి వస్తున్న క్రమంలో రోడ్డుపై అకస్మాత్తుగా చెట్టు కూలింది. దీంతో జహంగీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. జహంగీర్‌కు ఏప్రిల్‌లో వివాహం నిశ్చయం కాగా, సెప్టెంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉన్నది.



సత్తి ముత్తయ్య, యశోదమ్మ (ఫైల్)

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

డోర్నకల్, జూలై 25: భర్త మరణం తట్టుకోలేక భార్య గుండెపోటుతో మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం ముల్కలపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సత్తి ముత్తయ్య (80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం ఉదయం ముత్తయ్య మృతదేహం వద్ద ఆయన భార్య యశోదమ్మ (70) రోదిస్తూ గుండెపోటు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబసభ్యులు ఖమ్మం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- స్పాట్‌లోనే ముగ్గురు యువకుల దుర్మరణం
- కంది అక్షయ పాత్రలో విధులు నిర్వహిస్తున్న మృతులు

ప్రమాద స్థలంలో యువకుల మృతదేహాలు

కంది, జూలై 25: సంగారెడ్డి జిల్లా కంది మండలం తునికిల తండా సమీపంలో నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు పుల్కల్ మండలం గంగోజిపేట్ గ్రామానికి చెందిన కాశపాగ సందీప్‌కుమార్ (22), కాశపాగ నవీన